
సాక్షి
అనంతపురం
గురువారం । 23 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.30 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.30 వేలు ధర పలికాయి.



టమాట కిలో రూ.15
కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.8 పలికింది.

గరిష్టం/కనిష్టం
38.9°/ 18.1°
జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

కొనుగోలు కేంద్రాలను ఉపయోగించుకోండి



పుట్లూరులో ఏర్పాటు చేసిన పప్పుశనగ కొనుగోలు కేంద్రం

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)తో పప్పుశనగ కొనుగోళ్ల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. క్వింటా రూ.5,335 ప్రకారం 15 కేంద్రాల ద్వారా పప్పుశనగ కొనుగోళ్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రెండు మూడు రోజుల్లో మరో 10 కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమవుతాయని తెలిపారు. సీఎం యాప్‌లో ఆరు వేల మంది వరకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోగా.. ఇప్పటి వరకు 1,100 మంది రైతుల నుంచి 2,200 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేశామని వెల్లడించారు. వ్యర్థ పదార్థాలు ఒక శాతానికి మించి ఉండకూడదని స్పష్టం చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి తీసుకువచ్చిన పప్పుశనగను కొనుగోలు చేసి సకాలంలో ఆన్‌లైన్ ద్వారా ఖాతాల్లోకి చెల్లింపులు చేస్తామని తెలిపారు. ఈ సీజన్‌లో 19 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతులు ఉన్నందున సాధ్యమైనంత మంది రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పలు రైళ్లు రద్దు.. మరికొన్ని దారి మళ్లింపు




గుంతకల్లు: బెంగళూరు సమీపంలో రైల్వే పనులు జరుగుతున్నందున పలు రైళ్లను రద్దు చేయడంతోపాటు మరికొన్నింటిని దారి మళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మవరం-బెంగళూరు (06595/96) స్పెషల్ ప్యాసింజర్ రైళ్లను ఏప్రిల్ ఒకటి, ఆరు, 29 తేదీల్లో రద్దు చేసినట్లు వెల్లడించారు. ఇక పూరి-యశ్వంత్‌పూర్ (22883) ఎక్స్‌ప్రెస్ రైలును ఈ నెల 31న నంద్యాల, యరగుంట్ల, రేణిగుంట, జోలర్‌పేట్ మీదుగా యశ్వంత్‌పూర్‌కు మళ్లించినట్లు తెలిపారు. అదేవిధంగా ఎల్‌టీటీ ముంబై-కోయంబత్తూరు (11013) ఎక్స్‌ప్రెస్ రైలును గుంతకల్లు, రేణిగుంట, జోలర్‌పేట్, సేలం మీదుగా కోయంబత్తూరుకు మళ్లించినట్లు వివరించారు. గుంతకల్లు డివిజన్‌లోని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో భాగంగా గుంతకల్లు-రాయచూర్ స్పెషల్ ప్యాసింజర్ రైళ్లను 23 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు రద్దు చేసినట్లు తెలిపారు. నంద్యాల-కడప (07284/85), విజయపూర-రాయచూర్ స్పెషల్ ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 23 నుంచి 31 వరకు రద్దు చేసినట్లు వెల్లడించారు.

ప్రశాంతి నిలయంలో ఉగాది వేడుకలు



సత్యసాయి మహాసమాధి

ప్రశాంతి నిలయం: పండితుల పంచాంగ పఠనం... భక్తకోటి సాయి నామస్మరణ నడుమ ప్రశాంతి నిలయంలో శోభకృత నామ ఉగాది పర్వదిన వేడుకలు బుధవారం కనులపండుగగా జరిగాయి. సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే రీతితో సాయికుల్వంత్ సభా మందిరాన్ని పచ్చటి తోరణాలు, మామిడి కాయలు, పుష్పాలతో అలంకరించారు. అవధాని గోలి వెంకట సుబ్రహ్మణ్యం శర్మ పంచాంగ పఠనానికి భక్తులు పోటెత్తారు. సత్యసాయి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సుబ్రహ్మణ్యంశర్మను నూతన వస్త్రాలతో సన్మానించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడిని, తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం వేడుకల్లో భాగంగా ప్రముఖ సినీ ప్లేబ్యాక్ సింగర్ రమ్యా బెహరా నిర్వహించిన భక్తిరస సంగీత కచేరీతో భక్తులు మైమరచిపోయారు.



పంచాంగ పఠనం చేస్తున్న గోలి వెంకట సుబ్రమణ్య శర్మ



పంచాంగం వినిపిస్తున్న అర్చకులు, వేదపండితులు

ఉగాది ఉత్సవాలు ప్రారంభం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల ఉత్సవాల్లో తొలిరోజు గ్రామోత్సవం శోభాయమానంగా సాగింది. వేకువజామునే ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వర్ణ కవచ అలంకరణతోపాటు ప్రత్యేక పుష్పాలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయ ముఖ మండపం వద్ద పండితులు పంచాంగ పఠనం చేశారు. అనంతరం సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను గరుడ వాహనంపై కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేసి పురవీధుల్లో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తుల కాలక్షేపం కోసం గంగా నిలయ ప్రాంగణంలో రాత్రంతా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈఓ దొడ్డ వెంకటేశ్వరరెడ్డి, ఏఈఓ ధనుంజయ, ఇతర అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వారి గ్రామోత్సవం

పట్టణం.. ప్రభంజనం

- ఏటేటా పెరుగుతున్న జనాభా
- పట్టణాలకు పోటెత్తుతున్న పల్లె జనం
- పిల్లల చదువుల కోసమని కొందరు
- ఉద్యోగం.. వ్యాపారానికి మరికొందరు

పట్టణ జనాభా క్రమేణా పెరుగుతోంది. పల్లెల నుంచి వలస వస్తున్న వారి సంఖ్య ఏటేటా అధికమవుతోంది. పిల్లల చదువులు, ఉద్యోగం, వ్యాపారం తదితర అవసరాల రీత్యా పట్టణ ప్రాంతాలకు చేరుతున్నారు. నగరపాలక సంస్థ, పురపాలక సంస్థల పరిధి, శివారు ప్రాంత భూముల విలువ అమాంతం పెరిగిపోతోంది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గ్రామీణులు అవసరాలు.. అవకాశాల కోసం పట్టణాల వైపు పయనమవుతున్నారు. పల్లెల నుంచి వలస వస్తున్న వారితో పట్టణ జనాభా పెరుగుతోంది. నాలుగెకరాల పొలం ఉన్న రైతు కూడా తమ పిల్లలను మంచి స్కూళ్లలో చదివిస్తున్నారు. ఇక ఉద్యోగస్తులకు పట్టణాల్లో ఉండక తప్పనిపరిస్థితి. ఇవన్నీ పక్కన పెడితే పట్టణాలకు 30 కిలోమీటర్ల దూరంలో ఉద్యోగమైనా సరే రోజువారీ ఉద్యోగానికి వెళ్లి తిరిగి పట్టణం చేరుకుంటున్నారు. రూ.20 వేల వేతన జీవులు కూడా వ్యయం భారమైనా పట్టణం వైపే మొగ్గుచూపుతుండటం విశేషం.

అవసరాలు ఎన్నో...
అనంతపురం లాంటి మున్సిపల్ కార్పొరేషన్, కదిరి, ధర్మవరం, హిందూపురం, కళ్యాణదుర్గం, గుంతకల్లు, పుట్టపర్తి వంటి మున్సిపాలిటీల్లో ఏటా 2 నుంచి 3 శాతం పల్లెల నుంచి వస్తున్న జనాభా ఉన్నట్టు తేలింది. చిరువ్యాపారాలు, భవన నిర్మాణ రంగం కూలీలు, చిన్నచిన్న బడ్డీ కొట్లు వంటి వారు పట్టణం వైపే మొగ్గు చూపుతున్నారు. పట్టణాలకు 20 కిలోమీటర్ల దూరంలో పొలాలున్న వందలాదిమంది రైతులు సైతం పట్టణంలోనే ఉంటూ వ్యవసాయం చేసుకుంటున్న పరిస్థితి ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2021 అంచనాల ప్రకారం దాదాపు 42 లక్షల జనాభా ఉంది. కాగా గడిచిన పదేళ్లలో ఎక్కువమంది పట్టణాలకు చేరుకున్నారు. తాజా అంచనాల ప్రకారం 34 శాతం మందికి పైగా పట్టణాల్లో ఉన్నారు. ఈ లెక్కన 14.30 లక్షల మంది కేవలం పట్టణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. ప్రతి పదేళ్లకు సగటున 4 శాతం మాత్రమే పట్టణ జనాభా పెరుగుతుండగా గడిచిన పదేళ్లలో మాత్రం ఈ శాతం 6కు చేరిందని నిపుణులు చెబుతున్నారు.



అనంతపురంలోని తాడిపత్రి బస్టాండ్ ప్రాంతంలో రద్దీ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం జనాభాలో పట్టణ శాతం

సంవత్సరం	పట్టణ జనాభా శాతం
1971	17.77
1981	20.84
1991	23.50
2001	25.26
2011	28.07
2021	34.06 (అంచనా)

జీవనోపాధి కోసం వచ్చేశాం



మాది బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం గ్రామం. మాకు వ్యవసాయ భూములున్నా.. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు సరిగా పండకపోవడంతో జీవనోపాధి కోసం అనంతపురం వచ్చి స్థిరపడ్డాం. నేను శ్రీనివాస నగర్‌లోని ఓ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాను. తల్లిదండ్రులు వృద్ధులైపోయారు. వారికి నేనొక్కతే సంతానం కావడంతో పల్లెలో ఉండలేక నాతోపాటే నగరానికొచ్చేశారు.
– మల్లీశ్వరి, ల్యాబ్ టెక్నీషియన్, శ్రీనివాసనగర్, అనంతపురం

పిల్లల చదువుల కోసం..



మాది ఓడీసీ మండలం దాదిరెడ్డిపల్లి. పిల్లల చదువుల కోసం పల్లెను వదిలి 20 ఏళ్ల క్రితం అనంతపురం వచ్చాం. పల్లెలన్నీ పట్నం వైపు మళ్లుతుంటే రోజురోజుకూ ఇక్కడ జనం పెరిగిపోతున్నారు. నేను సాయినగర్‌లోని వైఎస్సార్ హాస్పిటల్ ఎదురుగా, మా భార్య ఐరన్‌బ్రిడ్జి దగ్గర శ్రీనివాస హాస్పిటల్ దగ్గర పచ్చి టెంకాయలు విక్రయిస్తూ జీవిస్తున్నాం. మా ఇద్దరు పిల్లల చదువులైపోయేదాకా ఇక్కడే ఉండక తప్పదు.
– సామల బయపురెడ్డి, వ్యాపారి

ఉపాధి, విద్యావకాశాలు పెరిగాయి



'గతంతో పోల్చితే పట్టణాల్లో నివసించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. పట్టణాల్లో ఉపాధి, విద్యావకాశాలు అపారం. దీన్ని దృష్టిలో ఉంచుకుని అధిక శాతం ప్రజానీకం పట్టణాల్లో స్థిరపడుతున్నారు. ఇటీవల కాలంలో చిన్న, పెద్ద తరహా పరిశ్రమలు, వ్యాపార సంస్థలు అధికమవడంతో కూలీలు, సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం పట్టణాల వైపు మొగ్గు చూపుతున్నారు.
– పీవీవీఎస్ మూర్తి, మునిసిపల్ ఆర్‌డీ

పంటనష్టంపై ప్రభుత్వానికి త్వరలో నివేదిక!

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల ప్రకృతి వైపరీత్యం వల్ల జరిగిన పంటనష్టంపై రెండు, మూడు రోజుల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ జిల్లా అధికారులు బి.చంద్రానాయక్, బి.రఘునాథరెడ్డి తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా వడగండ్లవాన బీభత్సం సృష్టించడంతో ఉద్యాన పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగిందన్నారు. 4,480 హెక్టార్ల విస్తీర్ణంలో అరటి, చీనీ, మామిడి సహా 30 రకాల ఉద్యాన పంటలు దెబ్బతినడంతో 4,700 మంది రైతులకు రూ.215 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలు తయారు చేశామని తెలిపారు. ప్రధానంగా పుట్లూరు, యల్లనూరు, నార్పల, శింగనమల, బుక్కరాయసముద్రం మండలాల్లో ఎక్కువగా నష్టం ఉండగా... గార్లదిన్నె, కూడేరు, ఉరవకొండ, అనంతపురం, గుంతకల్లు, గుత్తి, పామిడి, రాయదుర్గం, బొమ్మనహాళ్, రాప్తాడు తదితర మండలాల్లో కూడా కొంత వరకు నష్టం జరిగిందన్నారు. ఇక వరి, మొక్కజొన్న పంటలు బాగా దెబ్బతినగా వేరుశనగ, ఆముదం, కొర్ర, జొన్న, మినుము తదితర వ్యవసాయ పంటలు కూడా 17 మండలాల పరిధిలో 3 వేల హెక్టార్లకు పైగా దెబ్బతినడంతో రూ.20 కోట్ల వరకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని, మరోసారి పారదర్శకంగా తుది నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్: జిల్లాలో ఖాళీగా ఉన్న 61 అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ పోస్టుల భర్తీకి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టుల వారీగా అనంతపురం అర్బన్‌లో 9, గుత్తి 8, కణేకల్లు 4, కళ్యాణదుర్గం 5, కంబదూరు 2, కూడేరు 5, రాయదుర్గం 8, శింగనమల 5, తాడిపత్రి 10, ఉరవకొండ ప్రాజెక్టులో 5 అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. పోస్టుల వివరాలు రోస్టర్ వారీగా ఆయా ప్రాజెక్టు కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 7 రోజుల్లోగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కల చెదిరె..కడుపుకోత మిగిలే!

స్టెత్ వేసుకోవాల్సిన వాడు...మెడకు తాడు బిగించుకున్నాడు
ఆస్పత్రిలో ఉండాల్సిన వాడు మార్చురీలో పడుకున్నాడు
తెల్లకోటులో ఉండాల్సిన వాడు..తెల్లగుడ్డలో దూరిపోయాడు
అల్లారుముద్దుగా పెంచితే అందనంత దూరం పోయాడు
తండ్రి పోగుపోగును కలుపుతూ బంధం అల్లుతుంటే
తనేమో బంధం తెంపుకుని వెళ్లిపోయాడు
గాయానికి కట్టుకట్టాల్సిన వాడు...తల్లిదండ్రుల కడుపుకోత మిగిల్చాడు
జీవితమనే పరీక్షలో ఫెయిలై ఉరితాడుకు వేలాడాడు



నవీన్‌కుమార్ (ఫైల్)

- ఎంబీబీఎస్ పరీక్షల్లో ఫెయిల్
- ఉరివేసుకుని వైద్య విద్యార్థి ఆత్మహత్య
- శోక సంద్రంలో నేతన్న కుటుంబం

ధర్మవరం అర్బన్: ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పరీక్షల్లో మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయిన ఓ వైద్య విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ధర్మవరం పట్టణం తారకరామాపురంలో బుధవారం చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని తారకరామాపురానికి చెందిన రామాంజనేయులు, రాజమ్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు సంతానం. మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించే రామాంజనేయులు ఆడ పిల్లలిద్దరికీ వివాహాలు జరిపించాడు. చిన్న కుమారుడైన ముక్తాపురం నవీన్‌కుమార్ (23)ను వైద్యుడిగా చూడాలని కలలు కనేవాడు. ఈక్రమంలోనే ఖర్చుకు వెనకాడకుండా కుమారుడిని చదివించాడు. తండ్రి ఆశయానికి తగ్గట్టుగానే ఇంటర్, నీట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి కర్నూలు మెడికల్ కళాశాలలో సీటు సంపాదించాడు. మొదటి సంవత్సరం పరీక్షలు కూడా రాశారు. అయితే ఇటీవల వచ్చిన ఫలితాల్లో మూడు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యాడు. దీన్ని నవీన్‌కుమార్ అవమానంగా భావించాడు. తల్లిదండ్రులకు ఈవిషయం చెప్పలేక మథనపడ్డాడు. ఉగాది పండుగ నేపథ్యంలో మంగళవారం ధర్మవరానికి వచ్చిన నవీన్‌కుమార్...రాత్రి తల్లిదండ్రులతో కులాసాగా కబుర్లు చెప్పాడు. అనంతరం తండ్రి రామాంజనేయులు వద్దే పడుకున్న నవీన్‌కుమార్... అందరూ నిద్రపోయాక ఇంటి ఎదురుగా ఉన్న షెడ్డులోని ఇనుపరాడ్డుకు ఉరివేసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున నిద్రలేచిన తండ్రి పక్కలో ఉండాల్సిన కుమారుడు కనిపించకపోవడంతో బయటకు వెళ్లి చూశాడు. అప్పటికే కసువు ఊడ్చేందుకు షెడ్డులోకి వెళ్లిన రాజమ్మ ఉరికివేలాడుతున్న కుమారుడిని చూసి గట్టిగా కేకలు వేసింది. దీంతో రామాంజనేయులు కూడా పరుగున వెళ్లి ఇరుగూ పొరుగు సాయంతో కుమారుడిని కిందకు దించి చూడగా, అప్పటికే నవీన్‌కుమార్ మృతి చెంది ఉన్నాడు. వైద్యుడిగా చూడాలన్న కలను... కల్లలు చేసి వెళ్లిపోయావా అంటూ రామాంజనేయులు ఏడుస్తుంటే అతన్ని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న టూటౌన్ ఏఎస్ఐ డోణాసింగ్, జమేదార్ సూర్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలను తల్లిదండ్రుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉగాది రోజున ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నవీన్‌కుమార్ మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

- కొలిక్కి వచ్చిన జిల్లా పరిషత్ బడ్జెట్
- రూ.407.77 కోట్లతో 2023-24 బడ్జెట్ రూపకల్పన
- త్వరలో జరగనున్న జెడ్పీ సర్వసభ్య సమావేశం



అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయం

అనంతపురం సిటీ: జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉమ్మడి జిల్లా పరిషత్ బడ్జెట్ రూపకల్పన ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ప్రగతికి పెద్ద పీట వేస్తూ బడ్జెట్ అంచనాలు రూపొందించారు. సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఈఓ జల్లా శ్రీనివాసులు, గణాంకాధికారి అమృతరాజ్ నేతృత్వంలో ప్రత్యేక బృందం నెల రోజులు కసరత్తు చేసి ఉమ్మడి జిల్లా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రూ.407.77 కోట్ల అంచనాలతో బడ్జెట్ తయారు చేసింది. త్వరలో జరిగే సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆమోదం కోసం బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సన్నద్ధమయ్యారు.

ఏటేటా పెరుగుతున్న అంచనాలు
జనాభా, అవసరాలు, అంతకంతకూ పెరుగుతున్న ధరలు బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో ఏటేటా బడ్జెట్ అంచనాలు కూడా పెరుగుతున్నాయి. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.251.20 కోట్లు, 2022-23లో రూ.382.17 కోట్ల బడ్జెట్ కాగా.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.407.77 కోట్ల అంచనాలతో బడ్జెట్ రూపుదిద్దుకుంది.

ఉమ్మడి జిల్లాకు ఇదే చివరి బడ్జెట్
రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల పునర్వ్యవస్థీకరణకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. 13 జిల్లాలు కాస్తా 26 జిల్లాలు అయ్యాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా రెండుగా విడిపోయింది. 31 మండలాలతో అనంతపురం, 32 మండలాలతో శ్రీసత్యసాయి జిల్లా ఏర్పాటైంది. అన్ని శాఖలు రెండుగా విడిపోయినా జిల్లా పరిషత్ మాత్రం ఇప్పటికీ ఉమ్మడిగానే కొనసాగుతోంది. ప్రస్తుత చైర్‌పర్సన్ల పదవీకాలం పూర్తయ్యే వరకు ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్లుగానే వ్యవహరిస్తారు. దీంతో ఈసారి ప్రవేశపెట్టనున్న బడ్జెట్.. కీలకంగా మారింది. ఇదే చివరి బడ్జెట్ కూడా కానుంది.

బడ్జెట్ స్వరూపం ఇలా..

అంశం	అంచనా మొత్తం
సహాయక గ్రాంట్లు, విరాళాలు	రూ.388,47,43,000
నష్టపరిహారం - కేటాయింపులు	రూ.12,00,00,000
ఇతర గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు	రూ.6,50,20,000
సాంఘిక సంక్షేమం	రూ.50,00,000
ప్రజా పనులు	రూ.14,00,000
వడ్డీ జమలు	రూ.5,50,000
విద్య, క్రీడలు, కళలు, సంస్కృతులు	రూ.4,00,000
సెస్సు - ల్యాండ్ అసెస్‌మెంట్	రూ.2,00,000
మొత్తం	రూ.407,77,13,000

త్వరలో బడ్జెట్ ప్రవేశపెడతాం



2023-24 బడ్జెట్ రూపొందించాం. వాటిని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పరిశీలన కోసం పంపాం. ఆమె నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే.. త్వరలో జరగనున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో బడ్జెట్‌ను ప్రవేశపెడతాం. జెడ్పీటీసీ సభ్యుల ఆమోదం కోరుతాం.
– కె.భాస్కర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ, అనంతపురం

అభివృద్ధికి పెద్దపీట



ఉమ్మడి జిల్లాలో 63 మండలాలు ఉన్నాయి. గత పాలకుల నిర్లక్ష్యంతో చాలా ప్రాంతాలు అభివృద్ధికి దూరంగా ఉండిపోయాయి. అటువంటి ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తాం. ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమస్య ఉంది. అన్ని ప్రాంతాలనూ ఒకేలా చూడలేం. ఒక చోట ఎక్కువ అవసరం, మరో చోట తక్కువ అవసరం ఉండొచ్చు. అందుకే సమస్యలు ఎక్కువ ఉండి, పూర్తిగా వెనుకబడిన ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేలా బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించాం. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలకనుగుణంగా ఈసారి బడ్జెట్ రూపొందించాం.
– బోయ గిరిజమ్మ, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్, ఉమ్మడి అనంతపురం జిల్లా

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



సీజ్ చేసిన వాహనాన్ని చూపుతున్న విజిలెన్స్ అధికారులు

గుత్తి రూరల్: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను విజిలెన్స్ ఎస్ఐ శేషగిరి, డీసీటీఓ విజయలక్ష్మి, సీఎస్‌డీటీ కంబక్క వెల్లడించారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం అందడంతో విజిలెన్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం ఉదయం 6.30 గంటలకు గుత్తి - గుంతకల్లు మార్గంలోని మార్నేపల్లి క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన ఐచర్ వాహనాన్ని ఆపి పరిశీలించగా 248 బస్తాల్లో 141 క్వింటాళ్ల రేషన్ బియ్యం బయటపడింది. వాహనాన్ని సీజ్ చేసి గుత్తి పోలీసులకు అప్పగించారు. బియ్యం తరలిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా వెలుగుమాకులపల్లికి చెందిన ఐచర్ డ్రైవర్ రాజుని అరెస్ట్ చేశారు. విచారణలో గుంతకల్లుకు చెందిన హరి, చిరంజీవి సూచన మేరకు బియ్యాన్ని కర్ణాటకలోని బంగారుపేటకు తరలిస్తున్నట్లుగా రాజు అంగీకరించడంతో వారిపై కూడా కేసు నమోదు చేశారు.

27న '104' నూతన వాహనాల ప్రారంభం

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఉమ్మడి జిల్లాకు కేటాయించిన పది నూతన 104 వైద్యసేవల వాహనాలను ఈ నెల 27న ప్రారంభించనున్నారు. ఈ మేరకు 104 అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మేనేజర్లు కృష్ణమూర్తి, శంకర్ బుధవారం వెల్లడించారు. అనంతపురం జిల్లాకు ఆరు వాహనాలు మంజూరు కాగా, అనంతపురం రూరల్ పరిధికి 2, కణేకల్లు, ఉరవకొండ, తాడిపత్రికి ఒక్కొక్కటి చొప్పున వాహనాలను కేటాయించారు. ఓ వాహనాన్ని అనంతపురంలో బ్యాకప్‌గా వినియోగించనున్నారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాకు నాలుగు వాహనాలు మంజూరు కాగా, ముదిగుబ్బ, గోరంట్ల, మడకశిరకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించారు. జిల్లా కేంద్రంలో ఓ వాహనాన్ని బ్యాకప్‌గా ఉంచనున్నారు.

'ఆసరా'తో భరోసా

- 25న వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత సొమ్ము జమ
- మహిళల ఆర్థిక సాధికారతకు జగన్ సర్కార్ తోడ్పాటు
- 2,38,975 మంది లబ్ధిదారులకు రూ.183.56 కోట్ల లబ్ధి



అనంతపురం: రాష్ట్రంలో జగన్ సర్కార్ అమలు చేస్తున్న పథకాలతో మహిళలు ఆర్థిక సాధికారిత దిశగా అడుగులు వేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ గత మూడేళ్లలో లక్షలాది కుటుంబాలు కొత్తగా వ్యాపారాల బాట పట్టాయి. ఇప్పటి వరకూ గ్రామాల్లో కూలి పనులపై ఆధారపడి అరకొరగా జీవనం సాగిస్తున్న వారు... నేడు ప్రభుత్వ సాయంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తూ..

ఇప్పటి వరకూ అధికారంలో ఉన్న కాంగ్రెస్ అయినా.. టీడీపీ అయినా.. ప్రభుత్వ పథకాలు పొందేందుకు, పొందిన తర్వాత ఎన్నో ఆంక్షలు, పరిమితులు విధించాయి. దరఖాస్తుకు డెడ్ లైన్లు పెట్టేవి. దీని వల్ల అర్హులు కూడా వాటి ఫలాలు పూర్తిగా పొందలేకపోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాల అమలులో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారు. లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు గడువనేది లేకుండా ఎవరు.. ఎప్పుడైనా పథకం ద్వారా లబ్ధి పొందేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే వైఎస్సార్ ఆసరా పథకం అమలుతో మహిళలకు ఆర్థిక స్వేచ్ఛను అందించారు. పొదుపు సంఘాల మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే డబ్బును లబ్ధిదారుల అంగీకారం లేకుండా, సంఘం లేదా సంబంధిత మహిళల వ్యక్తిగత అప్పులకు జమ చేసుకోవడానికి వీల్లేదని బ్యాంకర్లకు స్పష్టం చేశారు. ఆ డబ్బును మహిళలు ఏ అవసరాలకైనా వినియోగించుకోవచ్చని, వీటిపై ఎలాంటి ఆంక్షలు ఉండవని కూడా స్పష్టం చేశారు.

సిద్ధించిన మహిళా సాధికారత

వైఎస్సార్ ఆసరా పథకంతో మహిళా సాధికారిత మరింత మెరుగుబడింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళల ఆర్థిక పురోగతికి మార్గాలు సుగమమయ్యాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలను రుణ విముక్తుల్ని చేసేందుకు వైఎస్సార్ ఆసరా పథకానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. ఇచ్చిన మాట ప్రకారం మహిళల స్వయం సహాయక సంఘాల్లోని అప్పుల నిల్వను నాలుగు విడతల్లో చెల్లించే బృహత్తర కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ రెండు విడతల్లో అనంతపురం జిల్లాకు రూ. 377 కోట్లను మహిళా సంఘాల పొదుపు ఖాతాలో జమ చేశారు. తాజాగా ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 5వ తేదీలోపు 2,38,975 మంది సభ్యుల పొదుపు ఖాతాల్లోకి రూ.183.56 కోట్లను జమ చేయనున్నారు. తాజాగా ఇవ్వబోతున్న వైఎస్సార్ ఆసరా మొత్తం కలుపుకుని మొత్తం మూడు విడతల్లో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులకు రూ.550 కోట్ల మేర లబ్ధి చేకూరింది.

బాబు హయాంలో దగా

డ్వాక్రా రుణమాఫీ పేరుతో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు.. హామీని నిలబెట్టుకోకుండా మహిళలకు మొండి చెయ్యి చూపాడు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు నమ్మి బ్యాంక్ రుణాలు చెల్లించని ఎందరో మహిళలు డీఫాల్టర్లుగా మారి పరువు కోల్పోయారు. చంద్రబాబు మోసానికి బలైన మహిళా సంఘాలు అప్పుల ఊబిలోకి కూరుకుపోయాయి. డ్వాక్రా సంఘాల కార్యకలాపాలు నిర్వీర్యమయ్యాయి. రాష్ట్రంలో జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత మహిళా సంఘాలు మళ్లీ పుంజుకున్నాయి. వైఎస్సార్ ఆసరా పథకంతో మహిళ సంఘాల బ్యాంక్ రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తానంటూ ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్ నిలబెట్టుకుంటూ ఇప్పటి వరకూ రెండు విడతల్లో రుణమాఫీ సొమ్మును మహిళా సంఘాల బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేశారు. దీంతో జిల్లాలోని 99.7 శాతం మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడ్డాయి. ప్రభుత్వ సహకారానికి తోడుగా బ్యాంకర్లు సైతం మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున మహిళా సంఘాలకు రుణాలు మంజూరు చేస్తున్నాయి. అంతేకాక ఆర్థిక లావాదేవీల నిర్వహణపై పొదుపు సంఘాల సభ్యులను చైతన్య పరుస్తున్నాయి.

జీవనోపాధుల మెరుగుపై అవగాహన

ఈ క్రమంలో వైఎస్సార్ ఆసరా నిధుల విడుదలకు ముందు, విడుదల తర్వాత వివిధ దశల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. నిధుల విడుదలకు ముందు తొలి విడతలో వైఎస్సార్ ఆసరా అమలు చేయడంలో ప్రధాన ఉద్దేశ్యాన్ని డీఆర్‌డీఏ- వైకేపీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమం గత పది రోజుల కిందట ముగిసింది. రెండో విడత కార్యక్రమాలు ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యాయి. స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమై సుస్థిర జీవనోపాధుల ఏర్పాటు అవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నారు. దిగ్గజ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలపై చైతన్య పరుస్తున్నారు. మూడో విడత కార్యక్రమాలు ఈ నెల 21, 22, 23, 24 తేదీల్లో జరగనున్నాయి. గ్రామ, వార్డు పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తూ వివిధ అంశాలపై అవగాహన కల్పించనున్నారు. ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకూ వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. మండలాల వారీగా నిర్వహించే కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

నియోజకవర్గాల వారీగా వైఎస్సార్ ఆసరా పథకం అమలు ఇలా..

నియోజకవర్గం	సభ్యుల సంఖ్య	లబ్ధి రూ. కోట్లలో
అనంతపురం	5,312	రూ.5.14
గుంతకల్లు	19,781	రూ.16.55
కళ్యాణదుర్గం	40,046	రూ.24.77
రాప్తాడు	24,208	రూ.21.08
రాయదుర్గం	36,912	రూ.22.66
శింగనమల	48,355	రూ.42.45
తాడిపత్రి	27,070	రూ.23.11
ఉరవకొండ	37,291	రూ.27.76
మొత్తం	2,38,975	రూ.183.56

25న నగదు జమ



ఈ నెల 25న వైఎస్సార్ ఆసరా నిధులను పొదుపు సంఘాల బ్యాంకు ఖాతాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేయనున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో మహిళలకు రుణ నిల్వను చెల్లించగా ఈ నెల 25న మూడో విడత కార్యక్రమం ద్వారా రూ.183.56 కోట్లు మంజూరు చేయనున్నారు. దీంతో 75 శాతం రుణ చెల్లింపు పూర్తవుతుంది. జిల్లా స్థాయిల్లో జరిగే కార్యక్రమాల్లో కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొంటారు. అనంతరం ఈ నెల 26 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకూ ఆసరా ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం.

– నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

మహిళల సంక్షేమానికి పెద్దపీట



మా సంఘం తరపున బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.1.30 లక్షల రుణం తీసుకున్నా. ఇప్పటి వరకూ వైఎస్సార్ ఆసరా పథకం కింద రెండు విడతలుగా రూ.21 వేల లబ్ధి పొందాను. ఈ డబ్బుతో ఫ్యాన్సీ గిఫ్ట్ అండ్ నావెల్టీస్ షాపు ఏర్పాటు చేసుకున్నా. నెలకు రూ.15 వేలు ఆదాయం వస్తోంది. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా సీఎం వైఎస్ జగనన్న మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేశారు. మాకెంతో సంతోషంగా ఉంది.

– డి. చంద్రకళ, తపోవనం, అనంతపురం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



మా పొదుపు సంఘం తరపున బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.1లక్ష, స్త్రీనిధి కింద మరో రూ.50 వేలు రుణం తీసుకుని మా ఊళ్లోనే లేడీస్ కార్నర్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నా. సీజన్‌ను బట్టి నెలకు రూ.9 వేల నుంచి రూ.14 వేల వరకు ఆదాయం సమకూరుతోంది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం వర్తించింది. ఇప్పటి వరకూ ఆసరా పథకం కింద రెండు దఫాల లబ్ధి చేకూరింది. ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం.

– పి.విజయలక్ష్మి, కల్లూరు గ్రామం, గార్లదిన్నె మండలం

ఆసరా తోడ్పాటునిచ్చింది



మా పొదుపు సంఘానికి నేనే లీడర్‌గా ఉన్నాను. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.70 వేలు రుణం తీసుకున్నా. మా ఊళ్లోనే కిరాణా, దుస్తుల వ్యాపారంతో పాటు ఎలక్ట్రికల్ దుకాణం నిర్వహిస్తున్నా. సీజన్‌ను బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల ఆదాయం సమకూరుతోంది. వైఎస్సార్ ఆసరా పథకం మాకెంతో తోడ్పాటునిచ్చింది. ఇప్పటి వరకూ ఈ పథకం కింద రెండు విడతలుగా రూ.30 వేలు లబ్ధి చేకూరింది.

– పి.చంద్రకళ, పుట్లూరు గ్రామం

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని యాడికి మండలం రాయలచెరువులో వెలసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు, అర్చను, అలంకరణలు పెద్ద ఎత్తున సాగాయి. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టింపజేసి కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఉభయదారులుగా రాయలచెరువుకు చెందిన వెంకటరమణ దంపతులు వ్యవహరించారు. సాయంత్రం 7 గంటలకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ తలారి అరుణ, నగేష్, ఎంపీపీ జమ్మలమడుగు హసీనాబేగం, రషీద్ దంపతులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి పర్యవేక్షించారు.

వివాహిత బలవన్మరణం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం మరుట్ల-2 గ్రామానికి చెందిన రామయ్య, మహేశ్వరి (38) దంపతులు ఏడేళ్ల క్రితం అనంతపురానికి వలస వచ్చి జన్మభూమి రోడ్డు సమీపంలో నివాసముంటున్నారు. 20 ఏళ్ల క్రితం వివాహమైన వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని రామయ్య పోషించుకుంటున్నాడు. ఇటీవల చిన్నపాటి విషయానికి సైతం దంపతుల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తి గొడవపడేవారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి దంపతలిద్దరూ గొడవపడ్డారు. ఆ సమయంలో లోపలి గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్న మహేశ్వరి ఎంతకూ బయటకు రాలేదు. భర్త పిలిచినా స్పందన రాలేదు. దీంతో రామయ్య తలుపులు బలంగా తోసి లోపలకెళ్లి చూశాడు. అప్పటికే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న మహేశ్వరి కనిపించడంతో చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేశాడు. సమాచారం అందుకున్న అనంతపురం నాల్గో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కన్నా.. నీవు లేకుండా బతకలేను!



మృతురాలు బుజ్జమ్మ

హిందూపురం: ఆ తల్లికి కొడుకు అంటే పిచ్చి ప్రేమ. కొడుకు లేకుంటే బతకలేను అనుకుంది. ఇటీవల కొడుకు అకాల మరణంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె.. కన్నా నువ్వు లేకుంటే బతకలేను అంటూ ప్రాణాలు తీసుకుంది. హృదయ విదారకమనిపించే ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురం పట్టణ పరిధిలోని కొట్నూరు బీసీ కాలనీకి చెందిన రామాంజి, బుజ్జమ్మ దంపతులు కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. వీరి ఏకైక కుమారుడు (21) మగ్గం పనులతో కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. గత ఏడాది ఉగాది పండుగకు రెండు రోజుల ముందు క్రితం చిన్న కారణానికే కుమారుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. కుమారుడి మరణంతో ఆ తల్లి మానసిక క్షోభకు గురైంది. తరచూ కుమారుడిని తలుచుకుని రోదిస్తుండేది. కుమారుడు లేకపోతే తాను బతకలేనని పలుమార్లు బంధువులతో చెప్పుకుని బాధపడేది. ఈ క్రమంలో బుధవారం ఉదయం కుమారుడి జ్ఞాపకాలు వెన్నాడడంతో తీవ్ర వేదనకు లోనైన ఆమె విషపూరిత ద్రావకం తాగి, అపస్మారక స్థితికి చేరుకుంది. విషయాన్ని గమనించిన భర్త రామాంజి వెంటనే ఆమెను ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై హిందూపురం వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అరటిలో యాజమాన్యం తప్పనిసరి



అకాల వర్షాలకు నేలవాలిన అరటి తోట

అనంతపురం అగ్రికల్చర్: మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు, పెనుగాలులకు అరటి తోటలు బాగా దెబ్బతిన్న నేపథ్యంలో నష్టం మరింత ఎక్కువ కాకుండా మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు ఉద్యానశాఖ ఉమ్మడి జిల్లా అధికారులు బి.రఘునాథరెడ్డి, జి.చంద్రశేఖర్ సూచించారు. డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన మేరకు రైతులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

- తోటల్లో మురుగునీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నీరు నాలుగైదు రోజులు అలాగే ఉంటే వేరు వ్యవస్థ కుళ్లి పోతుంది.
- మూడు నెలల కన్నా చిన్నవయసున్న మొక్కలు మురుగుతో దెబ్బతిన్నట్లైతే... నేల ఆరిన తర్వాత బాగా దుక్కి చేసి టిష్యూకల్చర్ లేదా శుద్ధిచేసిన తెగుళ్లు లేని సూది పిలకలు మళ్లీ నాటుకోవాలి.
- తేమశాతం ఎక్కువ కావడంతో గెలలు వేసే దశలో ఉన్న తోటల్లో సిగటోక ఆకుమచ్చ తెగులు, బ్యాక్టీరియా దుంపకుళ్లు తెగులు సోకే అవకాశముంది. దీని నివారణకు నేల ఆరిన తర్వాత గొర్రుతో అంతరసేద్యం చేయాలి. ఓ మొక్కకు 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను 20 నుంచి 25 రోజుల వ్యవధిలో రెండు మూడు దఫాలుగా వేయాలి. 5 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీరు, జిగురు కలిపి వారం రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారీ చేయాలి.
- సిగటోక ఆకుమచ్చ నివారణకు 1 మి.లీ ప్రొపికొనజోల్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదంటే 1 శాతం బోర్డో మిశ్రమాన్ని దుంప చుట్టూ తడిచేలా పోయాలి.
- అరటి దుంపలు కుళ్లిపోకుండా 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదంటే 1 శాతం బోర్డో మిశ్రమం దుంప చుట్టూ తడిచేలా పోయాలి. దుంపకుళ్లు ఆశించిన మొక్కల చుట్టూ 25 గ్రాముల బ్లీచింగ్ పొడి లీటర్ నీటికి కలిపి మొదలు బాగా తడిచేలా పోయాలి. అవసరమైతే 15 రోజుల తర్వాత మరోసారి ఇలా చేయాలి. ఆ తర్వాత మొక్కల మొదళ్లలో 50 గ్రాముల సూడోమోనాస్, 250 గ్రాముల వేపపిండితో కలిపి వేయాలి.
- పూర్తిగా అరటి గెలలు విడిచిన ప్రాంతాల్లో 5 గ్రాముల సల్ఫేట్ ఆఫ్ పొటాష్ (0-0-52) + 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ (13-0-45) మూడు రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారీ చేసుకోవాలి. ఎండిన అరటి ఆకులతో గెలలను కప్పి ఉంచి 15 రోజుల్లో మార్కెట్ చేసుకోవాలి.
- మొక్కలు పడిపోకుండా వెదురుకర్రలతో పోట్లు పెట్టాలి. మొక్క చుట్టూ నేలలో 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. 5 గ్రాముల సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని జిగురుతో కలిపి ఆకులు, లేత గెలలు బాగా తడిచేలా పిచికారీ చేయాలి. లేత గెలలపై 1 గ్రాములు కార్బండిజమ్‌ను లీటర్ నీరు, జిగురు కలిపి గెలలు బాగా తడిచేలా పిచికారీ చేయాలి.

సంబరంగా 'శోభకృత్' వేడుకలు



శాస్త్రీయ నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు



వేదపండితుడిని సన్మానిస్తున్న అధికారులు

- రానున్న రోజుల్లో జిల్లా సమగ్రాభివృద్ధికి శ్రమించాలన్న అధికారులు

అనంతపురం కల్చరల్: నూతన తెలుగు సంవత్సరంలో జిల్లా సమగ్రాభివృద్ధికి మరింత శ్రమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నతాధికారులు పిలుపునిచ్చారు. అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్ వేదికగా బుధవారం రాత్రి జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శోభకృత్ నామ ఉగాది పర్వదినాన్ని అధికారికంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి పలు శాఖల ఉన్నతాధికారులు హాజరై, జిల్లా వాసులకు శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్యబృందం చేసిన కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్యాలు ఆహుతులను అలరించాయి. అనంతరం వేదపండితులు నాగార్జున శర్మ, రఘోత్తమాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. పంపనూరు సుబ్రమణ్యస్వామి ప్రధాన అర్చకుడు సీతారామమోహన శర్మ (రాము) పంచాంగ శ్రవణం చేశారు. శోభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని వివరించారు. అనంతపురం, కళ్యాణదుర్గం ఆర్డీఓలు మధుసూదన్, నిశాంత్‌రెడ్డి, జిల్లా పర్యాటక శాఖాధికారి నాగేశ్వరరెడ్డి, తదితరులు మాట్లాడుతూ... సంప్రదాయ ఉగాది వేడుకల విశిష్టతను వివరించారు. నూతన తెలుగు సంవత్సరంలో పంచాగం పేర్కొన్న సందేశం అంశాలు కూడా ఉగాది షడ్రుచుల్లాగా ఉన్నాయని, జీవితంలో సుఖ, దుఃఖాలు వచ్చిపోతుంటాయని వాటిని సమర్థవంతంగా ఎదుర్కొన్నప్పుడే విజయాలు సొంతమవుతాయని అన్నారు. ఈ ఏడాదంతా చిత్తశుద్ధితో శ్రమించిన ఉద్యోగులు, విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అనంతరం దేవదాయశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ఆలయాలకు చెందిన వేదపండితులు పుల్లమాచార్యులు, జేఎం మల్లికార్జునస్వామి, నరసింహయ్యను సత్కరించారు. జిల్లా పరిషత్ సీఈఓ భాస్కరరెడ్డి, డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా పీడీలు నరసింహారెడ్డి, విజయలక్ష్మి, వేణుగోపాలరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి కుష్బూ కొఠారి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, అధికారులు గురుస్వామి, కిరణ్ దీపక్ పాల్గొన్నారు.



జానపద నృత్యంతో ఆకట్టుకున్న బాలిక

వైభవంగా చౌడేశ్వరిదేవి బ్రహ్మరథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రంలో చౌడేశ్వరిదేవి బ్రహ్మరథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది ఉగాది పర్వదినం సందర్భంగా రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే బుధవారం మధ్యాహ్నం అమ్మవారి రథోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, స్వస్తివాచన, రక్షాబంధన, కలశస్థాపన, అభిషేకములు, నవగ్రహ చౌడేశ్వరిదేవి మూలమంత్ర హోమము, రథాంగ హోమము, పూర్ణాహుతి, రథసంప్రోక్షణ తదితర పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని బ్రాహ్మణులు పల్లకీలో కూర్చుబెట్టి మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తుల జయజయధ్వానాల మధ్య రథోత్సవం నిర్వహించారు. ఆలయం ప్రాంగణం నుంచి గ్రామ సచివాలయం సమీపంలో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయం వరకు ఊరేగింపు సాగింది.

ఎద్దుల బండిని ఢీకొన్న బస్సు.. ఒకరి మృతి

పావగడ: ఎద్దులబండిని బస్సు ఢీకొన్న ఘటనలో ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మంగళవారం రాత్రి కర్ణాటకలోని పావగడ తాలూకా ఉప్పరహళ్లి నుంచి వస్తున్న ఎద్దులబండిని నాగలమడక పరిసర ప్రాంతంలో ఓ ప్రైవేట్ బస్సు ఢీకొంది. ఘటనలో బండి తోలుతున్న రైతు కిష్టప్ప (50) అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై తిరుమణి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వివాహిత దుర్మరణం

రొద్దం: ప్రమాదవశాత్తు వాహనంపై నుంచి కింద పడి ఓ వివాహిత మృతి చెందింది. వివరాలు.. రొద్దం మండలం తురకలాపట్నం గ్రామానికి చెందిన మౌనిక (27) బుధవారం ఉదయం తన మామతో కలసి ద్విచక్ర వాహనంపై ఆలయానికి బయలుదేరింది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్దకు చేరుకోగానే వాహనంపై నుంచి అదుపు తప్పి కింద పడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఓ కుమార్తె ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రొద్దం: మండలంలోని గోనిమేకుపల్లి సమీపంలో కంప చెట్లలో పేకాట ఆడుతున్న 13 మంది జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను ఎస్ఐ నాగస్వామి వెల్లడించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పోలీసులను గమనించి పేకాటరాయుళ్లు పరుగు తీయగా వెంబడించి పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.55,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండు ద్విచక్ర వాహనాలు, ఓ ఆటో సీజ్ చేశారు.

క్లుప్తంగా

పన్ను వసూలు

అనంతపురం క్రైం: నగరంలోని వివిధ ప్రాంతాల ప్రజలు బుధవారం ఉగాది పండుగ రోజున రూ.5లక్షల పన్ను చెల్లించారు. గురువారం నుంచి యధావిధిగా స్పెషల్ డ్రైవ్ ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. నగరంలోని నగరపాలక సంస్థ, పాతూరు, రెండో రోడ్డు, రాంనగర్‌లలో సచివాలయాల్లో పన్ను చెల్లించే సదుపాయం కల్పించినట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి సల్లాపురమ్మ ఉత్సవాలు


సల్లాపురమ్మ దేవత మూలవిరాట్

రాప్తాడు: మండలంలోని ఎం.బండమీదపల్లిలో కొలువైన సల్లాపురమ్మ భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతోంది. ఈ నెల 23 నుంచి 26 వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు, ప్రజలు ఏర్పాట్లు చేశారు. సల్లాపురమ్మ దేవత ఉత్సవాలు ఏటా ఉగాది పండుగ తర్వాత నాలుగు రోజుల గ్రామస్తులు నిర్వహించనున్నారు. గురువారం నుంచి ఆలయ ప్రాంగణంలో హోమాలు, ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు భక్తులు చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చి, మొక్కులు తీర్చుకుంటారు. మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, రెండోరోజు శనివారం శివుడి జాతర (పార్వేట) నిర్వహిస్తారు. అదే రోజు రాత్రి ఆణిముత్యాలు అనే ఉచిత నాటకాన్ని ప్రదర్శిస్తారు. మూడో రోజు సల్లాపురమ్మ జాతర (పార్వేట) ఉంటుంది. రాత్రికి సీతారామ చెక్క భజన గజ్జెల పూజ ఉంటుంది. నాలుగో రోజు సోమవారం ఆంజనేయస్వామి జాతర (పార్వేట) జరుగుతాయి.

టౌన్ ప్లానింగ్ అధికారుల బాధ్యతారాహిత్యం


రాంనగర్‌లోని జ్ఞాన సరస్వతి పాఠశాల ముందు సెల్లార్ ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్న దృశ్యం

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. నగరంలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ కమిషనర్ భాగ్యలక్ష్మి గతంలో ఏసీపీలు శ్రీనివాసులు రెడ్డి, సువర్ణ, టీపీఓ మహబూబ్‌జాన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దుర్గాంజలి, మురళీలకు మెమోలు జారీ చేశారు. కానీ వీరిలో ఎలాంటి మార్పు రాలేదు. నగరపాలక సంస్థ ఏసీపీ అత్యధికంగా 11 మెమోల వరకు అందుకున్నారు. వీరి బాధ్యరాహిత్యానికి డీటీసీపీ స్పందించి టౌన్ ప్లానింగ్ ఆర్‌డీతో విచారణ చేయించారు. నగరంలోని జరుగుతున్న అక్రమ నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు పరోక్షంగా వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి మాట్లాడుతూ నగరంలో భవనాల అతిక్రమణల కట్టడికి చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

25న రాతిదూలం లాగుడు పోటీలు

తాడిపత్రి టౌన్: స్థానిక కృష్ణాపురం జీరో రోడ్డులోని గంగమ్మ తల్లి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ఆకుల రామాంజులరెడ్డి, ఆకుల కొండారెడ్డి జ్ఞాపకార్థం ఈనెల 25వ తేదీన రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆకుల పెద్దనాగిరెడ్డి ఆయన సోదరుడు 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిన్ననాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.60 వేలు, రెండవ బహుమతి రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20.వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే కన్సొలేషన్ బహుమతి కింద రూ. 5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనే ఎడ్ల యజమానులు జతకు రూ.600 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

26న పాతకల్లూరులో..

గార్లదిన్నె: మండల పరిధిలోని పాతకల్లూరులో ఉగాది, శ్రీరామ నవమి పండుగ పురస్కరించుకుని ఈనెల 26న రాతి గుండు ఎత్తే పోటీలు, ఇరుసు పందెం పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాతి గుండు ఎత్తే పోటీల్లో గెలిచిన వారికి మొదటి బహుమతి రూ.4 వేలు, రెండవ బహుమతి రూ.3వేలు, మూడవ బహుమతిగా రూ.1,000, అలాగే ఇరుసు ఎత్తే పందెంలో గెలిచిన వారికి మొదటి బహుమతిగా రూ.6 వేలు, రెండవ బహుమతిగా రూ.3 వేలు అందజేయనున్నారు.

ఊరంతా ఉగాది ఉషస్సులు

- కోటి ఆశలతో శోభకృత్ నామసంవత్సర వేడుకలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


అలంకరణలో అమ్మవారు


కొత్తూరు అమ్మవారి శాలలో పండిట్ శ్రీనివాసమూర్తి పంచాంగ పఠనం


పంచాంగ శ్రవణానికి హాజరైన ప్రముఖులు, నగరవాసులు


శంకరమఠంలో శారదామాత


అలంకార సేవల్లో లక్ష్మీ వేంకటేశ్వరుడు


అలంకరణలో సుంకులమ్మఅమ్మవారు


ఆత్మకూరులో ఆంజనేయ స్వామి

అనంతపురం కల్చరల్: ఊరూరా 'శోభకృత్' నామ ఉగాది పర్వదినాన్ని ఆనందోత్సాహాల మధ్య బుధవారం జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ఆలయాల్లో పూజలు చేశారు. ప్రతి ఇంటా వేప పూత, మామిడి తోరణాలు కట్టారు. ఆలయాల్లో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. ఏడాదంతా ప్రతి ఇంటా వెలుగురేఖలు నిండాలని ఆకాంక్షిస్తూ ఉగాది విశిష్టతను తెలిపే విశేష సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు నిర్వహించారు.

టీటీడీ ఆధ్వర్యంలో..

తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో స్థానిక సోమనాథనగర్‌లోని కోదండరామాలయంలో పంచాంగ శ్రవణం జరిగింది. వేదపండితులు నాగశయన కాలమాన పరిస్థితులను తెలియజేశారు. పండిట్ వేణు, ప్రోగ్రాం అసిస్టెంట్ బాబు, సుధామణి తదితరులు ఉగాది పచ్చడి, ఇతర పూజాద్రవ్యాలు వితరణ చేశారు. కొత్తూరు అమ్మవారి శాలలో పెద్ద ఎత్తున ఉగాది సంబరాలు జరిగాయి. ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు గోపా మచ్చానరసింహులు నేతృత్వంలో వేదపండితులు శ్రీనివాసమూర్తి పంచాంగ శ్రవణంలో దేశకాల పరిస్థితులను తెలియజేశారు. ఈ సందర్భంగా భక్తులందరికీ ఉగాది పచ్చడి, అల్పాహారం అందించారు.

అనంతపురం క్లబ్‌లో...

తెలుగు భాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో అనంతపురం క్లబ్‌లో ఉగాది ఉత్సవాలు జరిగాయి. సంస్థ అధ్యక్షుడు నారాయణతో పాటూ చార్టెడ్ అకౌంటెంట్ హరిశ్చంద్రరామ, ఆదరణ రామకృష్ణ, రాజహంస శ్రీనివాసులు, పట్నం శివప్రసాద్ , హనుమంతప్ప ఉగాది విశిష్టతపై మాట్లాడారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. రెవెన్యూ కాలనీలోని రామాలయంలో ఉగాది సంబరాల్లో భాగంగా వాసుదేవశాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. విశ్వనాథ్ శిష్యబృందాలు సంప్రదాయ నాట్యాలతో అలరించారు. వివేకానంద యోగకేంద్ర అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఉగాది పూజలు..

నగరంలోని ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుడికి ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు చేశారు. ప్రధాన అర్చకులు ఏఎల్ఎన్ హరికృష్ణశర్మ ఉగాది విశిష్టతను వివరించారు.


టీటీడీ ఆధ్వర్యంలో పంచాంగ పఠనం


మాట్లాడుతున్న తెలుగుభాషా సంరక్షణ సమితి అధ్యక్షుడు నారాయణ


నృత్యం చేస్తున్న చిన్నారులు

రామనగర్‌లోని శ్రీభగవతి పెద్దమ్మ తల్లి ఆలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో నిర్వాహకులు వసతులు కల్పించారు. శృంగేరి శారదా శంకర మఠంలో చదువుల తల్లి శారదామాత అలంకార సేవల్లో పూజలందుకుంది. మేనేజర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో సామూహిక లలిత సహస్రనామార్చనలు, తీర్థప్రసాద వినియోగం ఘనంగా జరిగాయి.

సుంకులమ్మ అమ్మవారికి విశేష పూజలు..

అనంతపురం అర్బన్: నగర పరిధిలోని ఆమిదాల వీధి పాతూరు చెరువు కట్ట మీద ఉన్న కొత్తకోట సుంకలమ్మ అమ్మవారికి ఉగాది పండుగ పురస్కరించుకొని బుధవారం పూజలు నిర్వహించారు. ముందుగా సుంకులమ్మ అమ్మవారిని పూజారమ్మ బెస్త వరలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకుని ప్రసాదం స్వీకరించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

ఆత్మకూరు: మండలంలోని ప్రజలు ఉగాదిని పురస్కరించుకొని బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరుడికి, ఆత్మకూరులో అంకాలమ్మకు, భైరవేశ్వర స్వామికి , ఆంజనేయ స్వామికి భక్తులు పూజలు చేశారు. ఆత్మకూరు నుంచి పెద్ద ఎత్తున కల్యాణదుర్గం అక్కమ దేవతలకు బోనాలు ఎత్తుకొని గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదం, అన్నదానం చేశారు.

శిల్పారామంలో ఉగాది వేడుకలు..

అనంతపురం రూరల్: ఉగాది పర్వదినం సందర్భంగా శిల్పారామంలో చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలను శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ పర్యవేక్షించారు. ఉదయం వేదపండితులు పంచంగ శ్రవణం పఠించారు. సాయంత్రం అమృత కళానిలయం ఆధ్వర్యంలో చేపట్టిన సాంస్కతిక కార్యక్రమాల్లో భాగంగా చిన్నారులు చేపట్టిన కూచిపుడి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పల్లెల్లో శోభకృత్ నామ సంవత్సర వేడుకలు

రాప్తాడు: మండలంలోని ప్రతి ఇంటా బుధవారం ఉగాది పర్వదినాన్ని పునస్కరించుకొని సందడి నెలకొంది. శోభకృత్‌నామ సంవత్సరాన్ని పురస్కకరించుకొని ఆలయాల్లో కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. రాప్తాడులోని పండమేటి వెంకటరమణస్వామి, నీలకంటేశ్వరస్వామి, సాయిబాబా ఆలయం, పెద్దమ్మ, మారెమ్మ, ముత్యాలమ్మ ఆలయాలు, అయ్యవారిపల్లిలో ఎర్రిస్వామి తాత ఆలయం, హంపాపురంలోని మౌనగిరి క్షేత్రంలో వెలసిన 39 అడుగుల అభయాంజనేయస్వామి, మరూరులోని చిన్నకదిరయ్యస్వామి, పుల్లలరేవు, యర్రగుంట గ్రామాల్లో చెన్నకేశవస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

భక్తులతో పోటెత్తిన చిన్నకదిరయ్యస్వామి ఆలయం : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మరూరు చిన్నకదిరయ్యస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు వేలాది మంది తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు ఆలయం చూట్టూ పన్నేరపు బండ్లు, ట్రాక్టర్లు తిప్పారు.

'పోలేరమ్మ'కు ప్రత్యేక పూజలు..

రాప్తాడురూరల్: ఉగాది పండుగ సందర్భంగా అనంతపురం రూరల్ కందుకూరు పంచాయతీ కృష్ణంరెడ్డిపల్లిలో పోలేరమ్మ ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం భక్తిభావంతో ఇళ్లల్లో పూజలు చేసుకున్న భక్తులు సాయంత్రం పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి పూజల్లో పాల్గొన్నారు. ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు.

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉగాది పండుగ ఉత్సాహంగా జరుపుకున్నారు. ఒంటికొండలో బుధవారం తెల్లవారుజామున అక్కమ్మవారి యలవగంపను కొడపగానిపల్లి గ్రామం బుగ్గ మడుగు నుంచి ఆమిదాలకుంట ప్రసన్నాయపేట, ఓబుళంపల్లి గ్రామాల గుండా ప్రత్యేకంగా ఊరేగించారు. అనంతరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పన్నేరపు బండ్లు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయ ధర్మకర్త దుగ్గిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

కనగానపల్లి: మండలంలోని ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఇష్ట దేవతలకు పూజలు నిర్వహించి, పిండి వంటకాలతో పండుగను జరుపుకున్నారు.


పూజలు అందుకుంటున్న భైరవేశ్వర స్వామి


మామిళ్లపల్లిలో గంగమ్మతల్లి


రాప్తాడులో అలంకరణలో పెద్దమ్మ


రాప్తాడులో పూజలందుకుంటున్న మారెమ్మ

దీంతో ప్రతి గ్రామంలోనూ గ్రామ దేవతలకు పూజలు నిర్వహించి నారికేళాలు సమర్పించారు. కనగానపల్లి, తగకుంట, మామిళ్లపల్లి, ముక్తాపురం గ్రామాల్లోని సల్లాపురమ్మ, పెద్దమ్మ, నరసింహస్వామి, మల్లికార్జునస్వామి, మారెమ్మ, దుర్గమ్మ, గంగమ్మ ఆలయాల వద్ద భక్తుల సందడి కనిపించింది.


ఆత్మకూరు: అక్కమ్మదేవతలకు బోనాలు ఎత్తుకెళ్తున్న దృశ్యం


అమ్మవారి యలవగంప ఊరేగింపు


కనగానపల్లిలో పూజలందుకున్న బాట మారెమ్మ దేవత


రామనగర్‌లోని పెద్దమ్మతల్లి


పోలేరమ్మ అమ్మవారు

సేవా కార్యక్రమాలతో గుర్తింపు పొందాలి

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి

అనంతపురం సప్తగిరి సర్కిల్: సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందాలని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి ఆకాంక్షించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని రెండో ఎన్ఎస్ఎస్ యూనిట్‌ను జీఎఫ్ యూ(గవర్నమెంట్ ఫండ్ యూనిట్)గా గుర్తిస్తూ డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ ఉత్తర్వులను జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి డాక్టర్ కత్తిమణి వివేకానంద జారీ చేశారన్నారు. కళాశాలలో రెండో ఎన్ఎస్ఎస్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకునేందుకు 2016 సెప్టెంబర్ 22న అప్పటి ప్రిన్సిపాల్ యూనివర్సిటీ అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, యూనివర్సిటీ జాతీయ సేవా పథకం సమన్వయ అధికారి డాక్టర్ కత్తిమణి వివేకానందలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


జీఎఫ్‌యూ ఉత్తర్వును కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవికి అందిస్తున్న డాక్టర్ పరదేశినాయుడు

ఖిద్మత్ సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- డిప్యూటీ మేయర్ కోగటం



ఆర్థిక సాయం అందిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి

అనంతపురం సప్తగిరి సర్కిల్: కులమతాలకతీతంగా అందరికీ వడ్డీ లేని రుణాలు అందించేందుకు ఖిద్మత్ మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక సూర్యనగర్ 80 అడుగుల రోడ్డు మస్జిద్ ముసల్లాలో ఖిద్మత్ బ్యాంకును ప్రారంభించారు. కార్యక్రమానికి ఆయన, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహమ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ హాజరయ్యారు. వడ్డీ లేని రుణాన్ని అందించేందుకు నగరంలో సొసైటీని ఏర్పాటు చేసిన సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి తన వంతు బాధ్యతగా రూ. 50 వేలు అందించారు. కార్యక్రమంలో ఖిద్మత్ అధ్యక్షుడు హాజీపీరా, యాసిర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల జాతర


కట్టకిందపల్లిలో బోనాలెత్తిన గ్రామస్తులు


పోతలయ్యస్వామికి సమర్పించిన బోనాలు


ఎద్దులను అలంకరించి తీసుకొస్తున్న రైతు

అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లిలోని పోతులయ్యస్వామి బోనాల జాతర ఉగాది పండుగ సందర్భంగా బుధవారం వైభవంగా జరిగింది. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పాల్గొని బోనాలు సమర్పించారు. వర్షాలు బాగా కురవాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించేలా చూడాలని ప్రజలు పోతలయ్య స్వామిని వేడుకున్నారు. తొలుత గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

వైభవంగా ముసలమ్మ తెప్పోత్సవం




తెప్పోత్సవంలో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు, బీకేఎస్ చెరువులో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి ప్రక్కన చెరువు కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ తల్లి తెప్పోత్సవాన్ని బుధవారం ముసలమ్మ తల్లి వంశస్థులు సూర్యనారాయణరెడ్డి, సుశీలాదేవి, గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మ వారిని వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం పల్లకీలో కొలువుదీర్చి, అనంతపురం తాడిపత్రి రహదారిపై ఊరేగించారు. ముసలమ్మ దేవాలయం ప్రక్కనే ఉన్న అనంత సాగర్ (బీకేఎస్ చెరువు)లో అమ్మవారి తెప్పోత్సవం నిర్వహించారు. తెప్పోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎంపీపీ సునీత, వైఎస్సార్ సీపీ నాయకులు ఆలూరి రమణారెడ్డి, సర్పంచ్ పార్వతి హాజరయ్యారు.

కమనీయం.. అప్పేచర్ల పెద్దమ్మ రథోత్సవం

పెద్దవడుగూరు: మండలంలోని అప్పేచర్ల గ్రామ ప్రజలు ఉగాది పండుగను సరికొత్తగా జరుపుకున్నారు. గత ఆరేళ్లుగా గ్రామంలో శాంతి భద్రతల దృష్ట్యా ఎలాంటి ఉత్సవాలు జరుపుకోలేదు. అయితే ఈ ఏడు ఎలాగైనా ప్రతి ఒక్కరూ ఇంటి ఇలవేల్పుగా పూజించే పెద్దమ్మతల్లికి ఉత్సవాలు నిర్వహించాలని గ్రామ పెద్దలు తీర్మాంచుకున్నారు. అమ్మవారికి నూతన రథాన్ని తయారు చేయించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆలయ కమిటీ సభ్యులు రథోత్సవాన్ని నిర్వహించారు. ఎంతో వైభవంగా జరుగుతున్న రథోత్సవాన్ని చూసి కొందరు ప్రజలు కన్నీటి పర్యంతం అయ్యారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.